# ఇలా చేసి చూడండి !

శంకరమంచి పార్థసారథి

రాఘవయ్యగార్కి తమ ఆఖరి పిల్ల మాధవి. పెళ్ళి విషయం పెద్ద సమస్యగా తయారైంది. ఆ పిల్లనిగూడా ఒక అయ్యచేతిలోపెట్టే మార్గం ఏమిటో, దానికేం చెయ్యాలో అర్థంకాక సతమతమై పోతున్నారు. తానింకా సర్వీసులో వుంటే అంతగా దిగులుపడేవారు కాదేమో. కానీ ఆయన ఈ మధ్యన రిటైరయ్యారు. నిరుద్యోగం , మానసికంగాను, శారీరకంగాను నానాటికి ఆవహిస్తున్న వృద్ధాప్యం. పెళ్ళికాని పిల్ల, కల్సిరాని సంబంధాలు – అన్నీ ఆయన్ని పట్టి క్రుంగదీస్తున్నాయ్.

ఆయన రిటైరయ్యాక చేతికొచ్చిన డబ్బుల్లో ఇరవై వేలు తీసి పిల్ల పేరున బ్యాంకులో వేసారు. ఆ డబ్బుతో పిల్ల పెళ్ళి జరిపించాలని ఆయనాలోచన , కొడకులంటూ వున్నా వాళ్ళిద్దరూ ఈ విషయంలో పెద్ద వుత్సాహం చూపించకపోవటం గమనించేరాయన అయినా పిల్ల పెళ్ళి గురించి వాళ్ళని దేవిరించటం ఆయన కిష్టంలేదు. ఒక వేళ తాను నోరుతెరిచి అడిగినా వాళ్ళేం చెయ్యరని, చెయ్యలేరని తెల్సు – కారణం, వాళ్ళు కోడళ్ళు గీత గీస్తే దాటటానికి ఆలోచించ బుద్ధిమంతులైన మొగుళ్ళు.

అసలాయన కూతురి పెళ్ళి గురించి అంతలా దిగులుపడటానికి బాధపడటానికి వేరే కారణముంది, మాధవికి చదువబ్బలేదు – పదోక్లాసు రెండు సార్లు తప్పింది. ఎంతసేపూ సినిమా కబుర్లు, నవలల కబుర్లు తప్ప పుస్తకం తెరచి చదివినపాపాన పోలేదు. అప్పట్లో ఆయనంతగా పట్టించుకునే వారు కాదు. అదే ఇపుడు పెద్ద శాపం అయ్యింది. పైగా అందం గూడా అంతంతమాత్రమే. చూడటానికి ఎర్రగానే వుంటుంది గానీ మొహంలో కళ తక్కువ సన్నగా, రివటల వుంటుంది. మొటిమల మచ్చలతో రెండు చెంపలూ మరింత ఎర్రగా అసహ్యంగావుంటాయ్. ఈ కాలం మగపిల్లలు చదవుకుని వుద్యోగం చేస్తున్న ఆడపిల్లలపట్ల చూపిస్తున్న వుత్సాహం ఏమీలేని మాధవిలాంటి వారిపైన చూపించటం లేదు.

రాఘవయ్యగారు ఎన్నో సంబంధాలు చూసేరు. ప్రతివాళ్ళు మొట్టమొదటగా అడిగే ప్రశ్న ‘ మీ పిల్ల ఏం చదివింది – వుద్యోగం చేస్తోందా? ’ అని . ఆ ప్రశ్నలకి ఆయన చెప్పే

సమాధానం విన్నాక వాళ్ళ మొహాల్లోని ఉత్సాహం చప్పున చల్లారిపోవటం గమనించేవారు.

ఆయన ఇన్ని అవస్థలు పడుతున్నా, ఇంతగా మదనపడిపోతున్నా భర్త ప్రయత్నంలో ఏదో లోపం వుండబట్టే పిల్లకి పెళ్ళి కావటంలేదని నారాయణమ్మగారి నమ్మిక. " పదిమందికి చెప్పాలి. వూళ్ళు పట్టుకుని చెప్పులరిగేలా తిరగాలి. ఇలా కుర్చుంటే సంబంధాలు వస్తాయా " అంటూ పోరుతూ వుంటుంది. అంచేత ఆయన సాధ్యమైనంతవరకూ బయట తిరుగుతూ కాలక్షేపం చేస్తారు.

ఆరోజు గూడా అలా కాలక్షేపానికి బయల్దేరుతూ, క్రితం రోజు తనకి తెల్సినాయన ఇచ్చిన సంబంధం తాలూకు అడ్రసు కాగితాన్ని జేబులో వుంచకుమరీ బయల్దేరారు. ఆ కుర్రవాడు కేంద్ర ప్రభుత్వోద్యోగి. జీతం తక్కువ అయినా బుద్ధిమంతుడు. సాంప్రదాయకమైన కుటుంబం. పిల్లకి చదువు , వుద్యోగం లేకపోయినా బుద్ధిమంతురాలు, గుణవంతురాలు అయితే చాలట, ఇటు వంటి సంబంధాలు ఈ రోజుల్లో దొరకటం అరుదు, గుణానికి , బుద్ధికి, సాంప్రదాయానికి విలువనిచ్చేదెవరు ? అంచేత రాఘవయ్యగారు ఎలాగైనా ఈ సంబంధాన్ని స్తిరపర్చుకోవాలన్న ఆదుర్దా, ఆత్రంతో రోడ్డెక్కారు.

ఇంట్లోంచి బయల్దేరి మెయిన్ రోడ్డెక్కి పదడుగులు వేసేరోలేదో. ఎవరితో చెయ్యి భుజానపడటంతో ఆశ్చర్యంగా వెనక్కి తిరిగి చూసేరు అతడు ఎర్రగా వున్నాడు. వొత్తయిన క్రాఫు రంగు వేయటం వల్ల మరీ నల్లగా వుంది, రిమ్‌లెస్ కళ్ళద్దాలు అందంగా , హుందాగా వున్నాయ్. ఖరీదైన దుస్తులు వ్రేళ్ళకి వుంగరాలు. అతడు నవ్వుతున్నాడు. " ఏరా ఇంకా గుర్తుకురాలేదా ? " అంటున్నాడు.

లేదన్నట్లుగా తలూపారు రాఘవయ్యగారు.

" నేన్రా– దయానంద్‌ని " అన్నాడా వ్యక్తి.

అప్పుడుగాని పాతికేళ్ళనాటి బాల్య మిత్రుడిని పోల్చుకోలేకపోయారు.

" నువ్వురా – ఎంతగా మారిపోయావ్ ? ఎక్కడుంటున్నావ్ ? ఏం చేస్తున్నావ్ ? " ఇత్యాది ప్రశ్నలు ఎన్నో అడిగారు.

" అన్నీ చెబుతా గానీ – ఇక్కడే హొటల్లో దిగేను రూముకి వెళ్ళి కాస్త కాఫీ త్రాగుతూ అన్ని విషయాలు మాట్లాడుకుందాం అంటూ ఆప్యాయంగా ఆయన చెయ్యిపుచ్చుకుని, ఎదురుగా వున్న పెద్ద హొటల్లోకి నడిచేరు.

రాఘవయ్యగారు అతడితోపాటు హొటల్లోకి ప్రవేశించేముందు, గేటుకి పక్కగా వుంచిన ఒక బోర్డుని చూసేరు. అది నల్లని కాన్వాసుగుడ్డపై వ్రాయబడి వుంది ! ప్రముఖ

సైక్రియాటిస్టు, దయానంద్ మీ నగరానికి విచ్చేసియున్నారు. మీ అంతరంగికి సమస్యలకి ఆధునిక పరిష్కారాలు సూచించబడును. సందర్శించు వేళలు ! రూము నెంబరు వగైరాలు వ్రాయబడివున్నాయి.

ఆయన అతడితోపాటు మెట్లెక్కుతూ అడిగారు. " ఆ బోర్డు నీదేనా " అవునన్నట్లుగా తలూపాడు దయనంద్ సన్నగా నవ్వుతూ రూములో కూర్చున్నాక, కాఫీకి ఆర్డరిచ్చి, " ఏమిత్రా విశేషాలు చెప్పు " అన్నారు రాఘవయ్యగారి నుద్దేశించి.

" అలా కాదు, ముందు నీ గురించి చెప్పు. ఎక్కడుంటున్నావ్ ? పిల్లలెంతమంది ? " దయానంద్ సర్దుకుంటూ, " బొంబాయిలో సెటిలయ్యాను. అక్కడే ప్రాక్టీసు, ఇద్దరు పిల్లలు, నా భార్య గూడా అక్కడ ఎయిర్‌పోర్టులో చిన్న ఉద్యోగం, పిల్లలిద్దరూ కాలేజీల్లో చదువుతున్నారు, నెలకి పదిహేను రోజులు ఇలా ముఖ్యమైన నగరాలకి పట్టణాలకి క్యాంప్స్‌పై వస్తుంటాను. రాబడి బాగానే వుంది ఇక నీ గురించి చెప్పు " అన్నాడతను.

అంతలో కాఫీ వచ్చింది, ఇద్దరూ చెరో కప్పు అందుకున్నారు. రాఘవయ్య గారు కాఫీని చప్పరిస్తూ " నాది అతి మామూలు కథ. డిగ్రీ పూర్తిచేసి వెంటనే చిన్న వుద్యోగాన్ని సంపాదించేను. పెళ్ళిచేసుకున్నాను – నలుగురు పిల్లలు, ఇద్దరు మొగపిల్లలకి పెళ్ళిళ్ళు గూడా అయినాయి. ఒక ఆడపిల్ల పెళ్ళి గూడా చేసేను. భగవంతుడి దయవల్ల వాళ్ళు ముగ్గురు వాళ్ళ కాపురాలు వాళ్ళు చేసుకుంటున్నారు. ఎటొచ్చీ ఆఖరి పిల్లదే పెద్ద సమస్యయింది " అంటూ ఖాళీ కప్పుని క్రిందనుంచేరు.

" అంటే ఆర్థికంగా ఇబ్బందా ? లేక ..... " మధ్యలోనే ఆపి సిగరెట్టు వెలిగించుకునే ప్రయత్నంలో పడ్డాడు దయానంద్.

" పూర్తిగా ఆర్ధికం కాదు, నేనీమధ్యనే రిటైరయ్యాను. ఆ వచ్చిని డబ్బుల్లో కొంత దానిపేర్న బ్యాంకులో వేసాను ఇంకా కాస్తోకూస్తో తక్కువైతే మా అబ్బాయిలో నీలాంటి స్నేహితులో ఇస్తారు. కానీ అసలు సమస్య అదికాదు.

" మరింకేమిటి ? "

" మా అమ్మాయికి చదువు పెద్దగా లేదు. పదో తరగతి తప్పింది. ఇంక అందమంటావా, నా పిల్ల కాబట్టి నా కళ్లకి అందంగా కన్పించవచ్చు. అఫ్‌కోర్స్ కాస్త సన్నం అనుకో . వచ్చిన ప్రతి సంబంధంవాళ్ళు చూడటం .... వెళ్ళటం " అన్నారు రాఘవయ్యగారు దిగులుగా.

దయానంద్‌సిగరెట్టుని గట్టిగా దమ్ములాగి ఏదో ఆలోచిస్తున్నవాడిలా ఆపైన " అది నీకు దిగులైపోయిందంటావ్ – అవునా " అంటూ మిత్రుడి కళ్ళలోకి చూసేరు.

“ వయసొచ్చిన పిల్లకి పెళ్ళిచెయ్యక పోతే దిగులుకాక సంతోషమా ” అన్నా రాయన నవ్వుతూ.

“ నీకో విషయం తెల్సునా ”

“ ఏమిటి ? ”

“ ఇపుడు నువ్వు చెప్పింది అరుదైన సమస్యకాదు . దేశంలోచాలామంది ఆడపిల్లల తండ్రులు ఎదుర్కొంటునన్నదే – నాకొచ్చే కేసుల్లో చాలా భాగం ఇటు వంటి బాపతే – పిల్లకి పెళ్లికావటం లేదు, పిల్లవాడు చెప్పిన మాట వినడంలేదు. భర్త త్రాగుడు మానడం లేదు ”

“ వీటన్నిటికి నువ్వేం చేస్తావ్ ”

“ అని చాలా మంది అనుకుంటారు. ఖర్మని సరిపెట్టుకుని తమని తామే క్రుంగదీసుకుని వ్యధననుభవిస్తారు. కానీ చాలా మందికి తెలీని విషయం – మన కష్టాలకి, చాలా సమస్యలకి కారణం బుద్ధి – అంటే బ్రెయిన్ అన్నమాట. ఉదాహరణకి ఈ సిగరెట్టుని తీసుకుందాం చేతిలో కాల్తున్న సిగరెట్‌ని చూపిస్తూ చాలా గంభీరంగా చెప్పుకుపోతున్నారు.

రాఘవయ్యగారు విప్పారిన కళ్ళతో ఆశ్యర్యంగా వింటున్నారు

“ ఈ సిగరెట్టు త్రాగటం ఒక అలవాటు. సపోజ్ కాసేపు. అంటే కొన్ని గంటలు సిగరెట్టు అంటించలేదనుకో – అంతే. తల్లో అశాంతి మొదలువుతుంది. అశాంతి శరీరమంతా వ్యాపిస్తుంది. దాంతో చికాకు విసుగు. అసహనం మొదలై చేస్తున్న పనిపైన ఏకాగ్రత కుదరక పని పాడైపోతుంది. అంటే ఈ కల్లోలానికి జన్మస్థానం బ్రెయిన్‌లో.... ”

“ ఇపుడు నువు చెప్పేదానికి మా పిల్ల దానికి ఏవిటి సంబంధం ? ” అనడిగారు రాఘవయ్యగారు అర్థంకానట్లు.

“ వుంది – ఇప్పుడు పెళ్ళికావాల్సిన మొగపిల్లలు మనోస్థితిని చదివి అర్థంచేసుకోగల్గితే నీ ప్రశ్నకి సమాధానం లభిస్తుంది. ఉదాహరణకి ఈ కాలం పెళ్ళికావాల్సిన కుర్రాళ్ళు అడిగేది, కోరేది ఏమిటి ? పిల్ల అందంగా వుండాలి ఎర్రగా వుండాలి, చదువుకున్నది అయినా గుణవంతురాలై వుండాలి. మంచి వుద్యోగం చేస్తుండాలి. ఇలా ఎన్నో వీటన్నిటికి కారణం ఏవిటంటాల్ ! మానసికి దౌర్భల్యం, అంటే తనపైన తనకి నమ్మకం లేకపోవటం చేత, తన కోర్కెలు, వూహించకున్న కలలు భార్య ద్వారా నెరవేర్చుకోవాలని..... మానసికి చికిత్స ద్వారా ఇలాంటి యువకుల ఆలోచనా ధోరణిలో మార్పు తీసుకురావచ్చు ”

రాఘవయ్యగారు మౌనంగా వింటున్నారు.

అతను మళ్ళీ అన్నాడు " ఇపుడు నీ సమస్సే తీసుకుందాం. మీ అమ్మాయికి చదువులేదు. అందంలేదు. అంచేత పెళ్ళి కావుటం లేదు అవునా ? "

అవునన్నట్లు తలూపాడు రాఘవయ్యగారు.

" అక్కడే కాస్త ఆలోచించాలి. పెళ్ళి చూపులకంటూ వచ్చే కుర్రాడి మనస్తత్వం ఎలా వుంటుందో వూహించి మనం ప్రవర్తించాలి. "

" అంటే ఎలా ? "

" చెబుతా కాని మరి నా ఫీజు ...." అంటూ నవ్వేడు.

" అలాగే ఇచ్చుకుంటా చెప్పండి " అన్నాడు. రాఘవయ్యగారు స్నేహితుడి చతురతను సవ్యంగా అర్థం చేసుకున్నట్లుగా .

" ఈ సారి మీ అమ్మాయిని ఎవరైనా చూడటానికంటూ వస్తే తుచ తప్ప కుండా నే చెప్పినట్లు చెయ్యి .సంబంధం కుదరకపోతే అప్పుడు నన్నడుగు. "

☆ ☆ ☆

ఆ రోజే మాధవికి పెళ్ళిచూపులు.

ఆ మధ్యన ఎవరిద్వారానో తెల్సి, రాఘవయ్య గారు వెళ్ళి అతడిని కలవటం తన తల్లిదండ్రులు కూడా అక్కడే వుండటంచేత పిల్లని చూడటానికి వస్తామని చెప్పటం జరిగింది. ఆ రోజు రాఘవయ్యగారు. నారాయణమ్మగారు చాలా హడావిడిగా వున్నారు. దయానంద్ చెప్పిన విషయాలన్నీ మళ్ళీ మళ్ళీ గుర్తుతెచ్చుకుని ఏర్పాట్లు సరిచూసుకుంటున్నారు. ఇల్లంతా నీటుగా సర్దేరు. మాసిపోయిన కర్టెన్లు విప్పి ఇస్త్రీని తొడిగారు. పక్కింటి వారింట్లోంచి తెచ్చిన టూ – ఇన్ – వన్ సెట్టుని ఎదురుగా టేబిలు పైన వుంచేరు. తను గూడా ఇస్త్రీ పంచె, చొక్కా తొడుగుకున్నారు. భార్యకి, కూతురుకి చెయ్యాల్సినవన్నీ మళ్ళీ మళ్ళీ చెప్పారు. పనిపిల్ల మంగిని రిప్పించి దానిచేత ఏం చేయించాలో ఎలా చేయించాలో భార్యకి చెప్పారు.

సాయంత్రం నాలుగయింది, ఎండచల్లారుతోంది. మాధవీ, ఆమెతోపాటు పనిపిల్ల మంగి ముస్తాబై కూర్చున్నారు. అంతలో వచ్చేరు – పెళ్ళివారు. పెళ్ళి కొడుకు అతడి తల్లి, తండ్రి , చిన్న పిల్ల.... వాళ్ళని సాదరంగా ఆహ్వానించి కూర్చోపెట్టారు. ఆ కుర్రాడు చామన ఛాయగా వున్నాడు. కాస్త పొట్టిగా వుండటంచేత లావుగా కన్పిస్తున్నాడు. స్థబ్ధగా నిరుత్సాహంగా, బలవంతాన వచ్చినట్లు బిగదీసుకుని బింకంగా కూర్చున్నాడు. ఆ

పిల్లవాడి తండ్రి రాఘవయ్యగారితో పిచ్చాపాటి మొదలు పెట్టేరు. అతడి తల్లి ఇల్లంతా కళ్ళతోనే సర్వే చేస్తుంది.

రాఘవయ్యగారు తాను సర్వీసులో వున్నప్పుడు ఏ ఏ మంత్రులవద్ద పన్చేసారో, వాళ్ళకి తనంటే ఎంత ఇష్టమో ఇప్పుడిప్పుడే పేరు తెచ్చుకుంటున్న ఫలాన ఫిలిం డైరెక్టర్ తనకేవిధంగా దూరపు బంధువో, ఫలానా ప్రఖ్యాత రచయిత, తాను ఏ విధంగా పక్క పక్క వాటాల్లో అద్దెకున్నారో వివరించి చెబుతున్నారు. ఇదంతా గూడా దయానంద్ సూచించి మానసిక చికిత్సలో ఒక భాగం నిజానికి ఆ పిల్లవాడి తండ్రి ఆయన చెప్తున్న విషయాలన్నింటిని కళ్ళింతగా చేసుకుని వినసాగేరు. కానీ, విచిత్రం అసలైన పెళ్ళికొడుకు గోడ వైపు దృష్టిసారించి బొమ్మలా కూర్చున్నాడు.

అంతలో నారాయణమ్మగారు కాఫీ పట్టుకొచ్చింది. అందరూ కాఫీ సేవిస్తుండగా, పనిపిల్ల మంగి మెల్లిగా వచ్చి, అక్కడున్న చాపపైన తలొంచుకుని కూర్చుంది. మంగికి చేత పరికిణి, దాని పైన అసహ్యంగా కన్పించే ఎర్రపూల ఓణీ వేసారు. మొహానికి ఎక్కువగా పౌడరు అద్దేరు. మెళ్ళో పురాతనకాలపు పగడాలదండ వేసారు. మంగి అసలే నల్లగా ఉంటుంది. అంట్లు కొన్ని సంవత్సరాలుగా తోమటం చేత చేతులు మొరటుదేలి, కాయలు కాసాయ్. పళ్ళు కొద్దిగా ఎత్తుగా వుండటం చేత దవడలు అసహ్యంగా వుంటాయి. లావుగాను అవహ్యంగాను అన్పిస్తుంది చూడగానే.

మంగి చాలా బుద్దిమంతురాలికి మల్లే తలొంచుకుని, నారాయణమ్మగారు చెప్పినట్టే కూర్చుంది, ఇది కూడా దయానంద్ చికిత్సలో ఒక భాగం. మొదట అసహ్యమైన వస్తువుని చూపించి , ఎదుటివారు అసహ్యించుకుని వెళ్ళిపోతున్న తరుణంలో అంతకన్నా కాస్త మెరుగైన వస్తువుని చూపిస్తే అతడికి, అతడి కళ్ళకి ఆ వస్తువు చాలా అందంగా కన్పిస్తుంది. ఇదీ అతడి థియరీ.

ఆ పిల్లవాడు మంగివంక తదేకంగా చూస్తున్నాడు. అతడి తల్లితండ్రులు మంగి వంక ఒక్కసారి చూసి తలని త్రిప్పేసుకున్నారు. వాళ్ళ మొహాల్లో అసంతృప్తి అసహ్యం గమనించి రాఘవయ్యగారు తృప్తిపడ్డారు. కాస్త ఉత్సాహం వచ్చి చెప్పటం మొదలు పెట్టేరు " ఈ పిల్ల పేరు మంగతాయారు. మా దాయాదుల పిల్ల. దీనికి వెనుకా ముందూ ఎవ్వరూ లేరు. నేనే చేరదీసి పెంచేను. అసలు చదువు చెప్పిద్దామనుకున్నాను గాని, దానికబ్బలేదు. ఏం చేస్తాం చెప్పండి. దానికి సర్వస్వంనేనే ".

ఆ పిల్లవాడు మంగివంక మార్చి చూడటంతో ఆయనక్కాస్త భయం, ఆందోళన మొదలైనాయి.

" పిల్లని ఏమన్నా అడగాలనుకుంటే అడగండి " అంది నారాయణమ్మగారు గుమ్మం పక్కనుంచి.

" అబ్బే ఏం అడుగుతాం .... పిల్లని తీసికెళ్ళండి " అంది పిల్లవాడి తల్లి.

మంగి లేచి లోపలికెళ్ళిపోయింది.

అంతలో నారాయణమ్మగారు ఆవిడనిలోనికాహ్వానించింది. ఆవిడ అయిష్టంగానే లేచి లోనికెళ్ళింది. లోపలికి అడుగుపెట్టగానే మాధవి ఆవిడికి వక్కపొడి డబ్బానందించింది. ఆవిడ దాన్నందుకుకుంటూ మాధురిని పరిశీలనగా చూసింది.

మాధురి పట్టులంగా, పట్టుపావడా వేసుకుంది. చేతికి ఒక జత బంగారు గాజులు, మరో చేతికి వాచీ, మెళ్ళో గొలుసు, చెవులకి అధునాతనమైన దుద్దులు, మొహానికి కాస్మిటిక్స్ తళ తళలు....

" ఎవరీ పిల్ల " అందావిడ నారాయణమ్మగారితో.

" మా అమ్మాయండీ పేరు మాధవి. అత్తయ్యగారికి నమస్కారం చెయ్యవే " అంది. మాధవి చాలా భక్తి ప్రవృత్తులతో ఆవిడకి నమస్కారం చేసింది.

" మీ పిల్ల ఎంత బుద్ధిమంతురాలండి మహాలక్ష్మిలాగా వుంది " అంటూ ఆమెని చెయ్యిపుచ్చుకుని ముందు గదిలోకి నడిపించుకుంటూ తీస్కువచ్చి భర్తతో " వాళ్ళమ్మాయట, ఎంత బుద్ధిమంతురాలో చూసేరా " అంది మాధవి మళ్ళీ ఆయనకి నమస్కారం చేసింది.

మంగి అందాన్ని ఇంకా ఇముడ్చుకోలేక బాధపడుతున్న ఆయనగూడా విస్మయంగా తలూపారు. ఆ పిల్లవాడు ఒక్క సారి మాత్రం ఆమెవంక చూసి తల త్రిప్పుకూర్చున్నాడు.

ఆయన రాఘవయ్య గారితో " మీ పిల్ల పెళ్ళి చెయ్యరా ? " అనడిగారు.

" చెయ్యాలండి – కానీ ఇంకా సంబంధా లు చూడటం లేదు – అక్కడికి రెండు మూడు సంబంధాలు వాళ్ళంతట వాళ్లే వచ్చారు. కానీ ముందు మా మంగపెళ్లి చేసి, ఆపైన ఆలోచిద్దామని వుంది " అన్నారు త్యాగశీలిలా.

" పిల్లకేం లక్షణంగా వుంది ఎవరైనా కళ్ళకద్దుకుని చేసుకుంటారు " అన్నా రాయన మంగిని స్మరించుకుంటా.

లోపల ఆవిడ నారాయణమ్మగారితో " వదినగారు అబద్దం ఎందుకాడాలి ? మీ మాధవి లక్షణంగా వుందండి . పెళ్ళి చేసేటట్టయితే చెప్పండి, మావాడు మంచివాడు . ఈకాలం పిల్లవాడు కాదు. మీ సాంప్రదాయం, ఆచారాలు నా కెంతో నచ్చాయి, " అంది.

" అదేవిటో  వదిన గారూ – అచ్చం నాకూ అలాగే అన్పిస్తోంది. వాళ్ళిద్దరికీ వ్రాసిపెట్టి వుందేమో – అయినా నాదే  ముంది – ఆయనకి చెబుతాను "అంది నారాయణమ్మ గారు ఆనందాన్ని  లోలోపల దాచుకుంటూ.

ఆవిడ ముందుగదిలోకి వచ్చి భర్తతో  " ఏమండీ – వెడదామా " అంది.

దానికోసమే మేం వున్నట్లు ఆయన, ఆయనతోపాటు ఆ కుర్రాడు లేచాడు. ఆ కుర్రావాడు దేన్ని గూర్చో దీర్ఘంగా  ఆలోచించటం గమనించిన రాఘవయ్యగారు కొంపతీసి మంగిని చూసి జడుసుకున్నాడని భయపడ్డారు. ఇంటికెళ్ళి వుత్తరం వ్రాస్తామని చెప్పి  వాళ్ళు సెలవు పుచ్చుకున్నారు. ఆవిడ వెళ్ళే ముందు  మళ్ళీ  మాధవి వంక చూడటం నారాయణమ్మగారు గమనించలేకపోలేదు.

వాళ్ళని సందు చివర దిగబెట్టిన రాఘవయ్యగారు మొహం సంతోషంతో వెలిగిపోయింది.

" మనపిల్లని చూడగానే  ఎంతమెచ్చుకుందని ? మనకభ్యంతరం లేకపోతే  వియ్యం అందుకుందామంది " అని  భార్య చెప్పిన విషయం విని మరింత పొంగిపోయేరు.

అంతలో బట్టలు మార్చుకుని ! వెళ్ళబోతున్న మంగిని ఆపి. జేబులోంచి పర్సుతీసి అయిదు రూపాయల కాగితం  ఆమె కందిస్తూ  " మంగీ  మా కెంతో  సహాయం చేసావ్. ఇది పెట్టి సినిమాకి వెళ్ళు " అన్నారు.

మంగి ఆ నోటు నందుకుని ప్రక్కింట్లో అంట్లు తోమటానికి హడావుడిగా వెళ్ళింది.

☆ ☆ ☆

సరిగ్గా పది రోజుల తర్వాత వుత్తరం వచ్చింది.

" ఏమేవ్ వుత్తరం వచ్చింది " అంటూ భార్యని పిలిచేరు.

" ఏం వ్రాశారు ? " అంటూ ఆత్రంగా వచ్చిందావిడ.

" ఏం వ్రస్తారు ? మనం అనుకున్నదే అయ్యుంటుంది " అంటూ వుత్తరాన్ని  విప్పేరు.

చాలా పెద్ద వుత్తరమే వ్రాశాడాయన.

" పూజ్యులు  రాఘవయ్య బావగార్కి – నమస్కారాలు. ఉభయ కుశలోపిరి వుత్తరం వ్రాయటం ఆలస్యమైంది.  మావాడు  తా నాలోచించుకుని  జాబు వ్రాస్తానన్నాడు. దానికోసం ఎదురుచూడటంలో జాప్యం జరిగింది. నిన్ననే వాడి వద్దనుంచి  జాబు వచ్చింది.

" మా పిల్లవాడు అందరిలాంటివాడు కాదు. పూర్తిగా పాతకాలం మనిషి. కాని వాడి కొన్ని ఆలోచన్లు చాలా అధునాతంగాను, ఆశ్చర్యంగాను వుంటాయి. నాకు నా భార్యకి మీ

పిల్ల మాధవి నచ్చింది. ఆమెని మా ఇంటి కోడలుగా చేసుకోవాలని వుంది. ఇదే విషయాన్ని మేము మా అబ్బాయికి చెప్పగా వుద్దేశ్య ఆలోచించి వ్రాస్తానన్నాడు.

" వాడు నాకు వ్రాసినదాని ప్రకారం, వాడు మీ దూరపు బంధువులపిల్ల చిరంజీవి మంగతాయారుని వివాహం చేసుకోవాలని నిశ్చయించాడు. కారణాలు గూడా వ్రాసేడు. శారీరక అందం, ఆకర్షణ తనకి ముఖ్యం కాదని, నమ్రత, అణుకువలకి తాను ప్రాధాన్యతస్తానని వ్రాసేడు. అదీకాక ఆ పిల్లకి వెనకాముందు ఎవ్వరూ లేని కారణాన , అలాంటి అనాధకి ఒక దారి చూపించటం కన్నా తన బ్రతుక్కి సార్ధకత ఏవుందని గూడా వ్రాసేడు. అందరూ అలా తప్పుకుపోతే వాళ్ళ గతేంకానని ఎదురు ప్రశ్నించాడు.

" చెప్పాను గదా వాడిదో విచిత్రమైన మనస్తత్వం – ఒకసారి ఒక నిర్ణయం తీసుకున్నాక ఇక ఎంతమంది చెప్పినా వినడు – అయినా వాడి జీవితం వాడిష్టం. అంచేత చిరంజీవి మంగతాయారుని కోడలుగా చేసుకోవటనాకి నిర్ణయించాము– కాబట్టి తమరు మంచి రోజు చూసుకువస్తే మిగతా విషయాలు మాట్లాడుకుని , ముహూర్తాలు గూడా పెట్టుకుందాము.

" చిరంజీవి మాధవికి నా ఆశీస్సులు.

ఆ వుత్తరం చదవటం పూర్తిచేసిన రాఘవయ్యగారు రాతిమనిషిలా బిగుసుకుపోయారు. భార్య అడుగుతున్న ప్రశ్నలు ఏదీ విన్పించటంలేదు. అలాగే శూన్యంలోకి చూస్తూ కూర్చుండిపోయారు.

మంగి పక్కింటి ఇల్లాలికేదో విషయం చెప్పి పెద్దగా నవ్వుతోంది.

**------- అయ్యిపోయింది -------**